



Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com






ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 577 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 05 బుధవారం నవంబర్ 2025 పేజీలు : 4 వెల : అమూల్యం


# 'సాస్కి' నిధులను సద్వినియోగం చేసుకోవాలి

- గ్రామీణ ప్రాంతాలో రహదారులకు రూ.2 వేల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చింది

- సాస్కి నిధులతో నిర్మించే రోడ్లలో ఎక్కడ నాణ్యతా ప్రమాణాలు తగ్గకూడదు

-నాణ్యతా ప్రమాణాల విషయంలో బాధ్యత అధికార యంత్రాంగానిదే -నిర్మాణ దశ నుంచి పూర్తయ్యే వరకూ క్వాలిటీ చెక్ చేస్తాము

- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో మరో ముందడుగు

- ప్రజలకు ఆ నిధుల ఫలాలు అందించాలి - పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం

మంగళగిరి, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, నవంబర్ 04 : రాష్ట్రంలోని గ్రామాల్లో రహదారుల స్థితిగతులను మార్చి నూతన రోడ్లు నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'సాస్కి' (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్) పథకం ద్వారా ఆంధ్ర ప్రదేశ్ కు రూ.2 వేల కోట్లు నిధులు సమకూర్చింది. ఈ నిధులను సద్వినియోగం చేసుకొని, ప్రజలకు పటిష్టమైన రహదారులు అందించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లను పునర్నిర్మించే కార్యక్రమం చేపడుతున్నామని, ఇందులో బాగా దెబ్బ తిన్న రోడ్లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారం మూలంగా రాష్ట్రానికి సాస్కి నిధులు సమకూరాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో వీటిని సద్వియోగం చేసుకుందామన్నారు. సాస్కి నిధుల వినియోగించే ప్రణాళికపై పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.




3


# దామాషా పద్ధతిలో బీసీ కార్పొరేషన్లకు నిధులు

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

- బీసీ రక్షణ చట్టం రూపకల్పనకు ప్రణాళికలు

- త్వరలోనే కుట్టుమిషన్ల పంపిణీ

- ఆదరణ 3.0తో కుల, చేతివృత్తుల వారికి శాశ్వత ఉపాధి

- కార్పొరేషన్ చైర్మన్లకు అన్ని విధాలా ప్రాధాన్యం : మంత్రి సవిత

- భువనమ్మకు మంత్రి సవిత అభినందనలు



4


# ఏపీ అభివృద్ధికి కేంద్రంగా భోగాపురం

-పారిశ్రామిక అభివృద్ధికి అతి కీలకం

-వచ్చే నెలలోనే ట్రయల్ రన్ నిర్వహిస్తాం

కేంద్రపౌరవిమానయాన మంత్రి రామ్మోహన్



4


# విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైసీపీ నేతల వీరంగం..

## జోగి రమేశ్ భార్య, కుమారులపై కేసు

- పోలీసులను తోసేసి, ఎమర్జెన్సీ వార్డు అద్దాలు పగలగొట్టిన అనుచరులు

- 'నీ పేరు డిజిటల్ బుక్‌లో రాస్తాం' అంటూ ఎస్సైకి తీవ్ర హెచ్చరికలు- ఘటనకు సంబంధించిన వీడియోలను పరిశీలిస్తున్న పోలీసులు



విజయవాడ, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 04 : విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైకాపా నేత జోగి రమేశ్ కుటుంబ సభ్యులు, అనుచరులు సృష్టించిన గందరగోళంపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడటంతో పాటు, ఆసుపత్రి అద్దాలు పగలగొట్టిన ఘటనలో జోగి రమేశ్ భార్య శకుంతల, ఇద్దరు కుమారులు రాజీవ్, రోహిత్‌తో పాటు మరికొందరిని నిందితులుగా చేర్చారు. నకిలీ మద్యం కేసులో అరెస్టయిన జోగి రమేశ్, రాములను కోర్టులో హాజరుపరిచే ముందు వైద్య పరీక్షల నిమిత్తం పోలీసులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న జోగి రమేశ్ కుటుంబ సభ్యులు, వైకాపా శ్రేణులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డులోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో వైకాపా శ్రేణులు పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిని బలవంతంగా నెట్టుకుంటూ లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ తోపులాటలో ఎమర్జెన్సీ వార్డు ప్రవేశ ద్వారం వద్ద ఉన్న అద్దాలు పగిలిపోయాయి. "జై జోగి" అంటూ నినాదాలు చేస్తూ వారు సృష్టించిన గందరగోళంతో ఆసుపత్రి ప్రాంగణంలో ఉద్రిక్తత నెలకొంది. అక్కడ విధుల్లో ఉన్న మాచవరం ఎస్సై శంకర్ రావు వారిని అడ్డుకోగా, ఆయనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఈ ప్రభుత్వం ఉండేది ఇంకో రెండేళ్లే. నీ పేరేంటి? డిజిటల్ బుక్‌లో రాస్తాం. నీ కాలర్ పట్టుకుని నిలదీస్తాం. నీకు భయం అంటే ఏంటో చూపిస్తాం" అంటూ తీవ్ర పదజాలంతో దూషించారు. ఈ గందరగోళంలో ఓ కానిస్టేబుల్ కిందపడిపోగా, అతడిని తొక్కుకుంటూ ముందుకు వెళ్లినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసి, పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై ఏ1గా జోగి రమేశ్ భార్య శకుంతల, ఏ2గా పెద్ద కుమారుడు రాజీవ్, ఏ3గా చిన్న కుమారుడు రోహిత్‌తో పాటు మరికొందరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఘటన జరిగిన సమయంలో తీసిన వీడియో ఫుటేజీలను పరిశీలించి, మరో 10 నుంచి 15 మందిని నిందితులుగా చేర్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.






- గణనీయంగా తగ్గిన ఉపాధి కల్పన
- 47.6శాతం తగ్గిన పనిదినాలు
- 19.94శాతానికి తగ్గిన కుటుంబాల సంఖ్య
- తొలగించిన జాబ్‌కార్డుల పునరుద్ధరణలో నిర్లక్ష్యం

# ఉపాధికి హామీ లేమి!

సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాంద్ర, నవంబర్ 04 : గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు పని కల్పించి వారిని ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులో రాష్ట్రం వెనుకబడింది. కార్మికుల సంఖ్య పెరిగినా ఉపాధి లేకపోవడంతో నిర్దేశించిన వేతనాన్ని కార్మికులు పొందలేకపోయారు. లిబ్‌టెక్ ఇండియా సంస్థ 2025 ఏప్రిల్ సెప్టెంబర్ వరకు ఉపాధి హామీపై నిర్వహించిన సర్వే ఈ విషయాన్ని తేల్చింది. ప్రభుత్వ నివేదికల ఆధారంగానే తాము ఈ రిపోర్టు తయారు చేసినట్టు ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉపాధి పనుల అమలు తీరుపై తాజా గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

**- సగటు పనిదినాల్లో క్షీణత**

గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పనిచేసిన ప్రత్యేక కుటుంబాల సంఖ్య 25.33లక్షల నుంచి 19.94లక్షలకు తగ్గింది. అంటే ప్రతి కుటుంబానికి సగటున 41రోజుల నుంచి 27 రోజులకు పనిదినాలు పడిపోయాయి. ఏప్రిల్ సెప్టెంబర్ మధ్యలో మొత్తం పనిదినాలు 47.6శాతం తగ్గాయి. దేశ వ్యాప్తంగా ఆ తగ్గుదల 10.4శాతం ఉంది అని గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఆదాయం తగ్గటానికి ప్రధాన కారణం పనిదినాలను కల్పించటంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని అర్థమవుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు పని కల్పించి వారిని ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం అమలులో రాష్ట్రం వెనకబడటానికి నిర్వహణలో నిర్లక్ష్యం తప్ప మరొకటి కాదని విమర్శలు ఉన్నాయి.




**- వేతన నష్టం..**

పని దినాలు తగ్గిపోవడం వల్ల ఆదాయాలు పడిపోయి, కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయి. కేంద్రం ప్రకటించిన వేతనం రూ.300 నుంచి రూ.307కు పెరిగినప్పటికీ పనిదినాలు తగ్గటం వల్ల కుటుంబం ఏడాదికి రూ.1,686 మాత్రమే పొందింది. గతేడాది ఉన్న పనిదినాలే కల్పిస్తే..ప్రతి కుటుంబ రూ.3,515 అదనంగా సంపాదించేదని ఉపాధి హామీ కార్మికులు తెలిపారు. ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థను తప్పనిసరి చేయటం వల్ల కార్మికులకు ఇబ్బందిగా మారింది. ఇందుకోసం కార్మికుల జాబ్ కార్డుకు ఆధార్ లింకు అవ్వాలి. ఆధార్, జాబ్ కార్డుపై పేరు సరిగ్గా పొంతన కుదరాలి. బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ లింక్ కావడంతోపాటు ఎన్‌పీసీఐలో నమోదు కావాలి. వీటిల్లో ఏది లేకపోయినా కార్మికులు ఏబీపీఎస్‌కు అనర్హులుగా మారుతున్నారు. 2022-23లో ఆధార్ ఆధారిత చెల్లింపు విధానం(ఏబీపీఎస్) అమలు సమయంలో 5.1లక్షల జాబ్ కార్డులు తొలగించినట్టు సర్వే వెల్లడించింది. అయితే, అలాంటి తొలగింపు తర్వాత పునరుద్ధరణ చర్యలు చేపట్టకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. 2025-26లో తొలగింపులు కొనసాగుతున్నాయి. కానీ..తొలగించిన వారిని తిరిగి చేర్చుకునే ప్రక్రియ జరగటం లేదు. అత్యధిక తగ్గుదల ఉన్న జిల్లాల్లో మేడ్చల్ మల్కాజిగిరి (-92.8శాతం), జోగులాంబ గద్వాల(-72శాతం), కామారెడ్డి( -68శాతం) నిజామాబాద్(-67శాతం) ఉన్నాయి. ఇది ఆందోళన కలిగించే విషయం.

**- మోస్తరుగా తగ్గిన జిల్లాలను పరిశీలిస్తే..** ఆదిలాబాద్(-18శాతం), నల్లగొండ(-24.5శాతం),యాదాద్రి భువనగిరి(-34.3శాతం), సిద్దిపేట(-34.7శాతం)గా ఉన్నాయి. తెలంగాణలో నమోదైన 53లక్షలకు పైగా కార్మికులకు ఈకేవైసీ పూర్తి చేయలేదు. దీంతో వేతనాలు ఆలస్యం కావడం, లేదా నిరాకరించటం చేస్తున్నారు. రాష్ట్రంలో కేవలం 48.5శాతం మాత్రమే ఈకేవైసీ పూర్తయిందంటే..పరిస్థితి ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థమవుతున్నది. సామాజిక తరగతులవారీగా చూసినప్పుడు ఎస్సీ (-48.3శాతం) ఎస్టీ (-41.7శాతం) ఇతరులు (-49.3శాతం) తగ్గుదల ప్రభావాన్ని తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. పథకం అమలు చేయడంలోనూ, కార్మికులకు ఉపాధి కల్పించడంలోనూ ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపించింది.

## లస్కర్లకు రెయిన్ కోట్లు అందజేసిన డెల్టా ఛైర్మెన్ మురాలశెట్టి సునీల్



పిఠాపురం, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 04 : పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయం నందు మో%శీ%థా తుఫాన్ ను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో కీలకంగా పనిచేసిన పిబిసి పరిధిలో ఉన్న 14 మంది లస్కర్లకు గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ రెయిన్ కోట్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి డిసి విజయ గోపాల రాజు, కాజులూరు డిసి లాకాని కృష్ణ చైతన్య, సిరిపురం డిసి పేపకాయల నారాయణరావు, ఎర్రపోతవరం డిసి సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, కొమరిపాలెం డిసి వేణుగోపాల్ రెడ్డి, కాకినాడ డిసి కోప్పిరెడ్డి వీరస్వామి, రామచంద్రపురం డిసి సత్యానంద రెడ్డి, ఇరిగేషన్ డిఈ సంతోష్ కుమార్, జేఈ పద్మజ, జేఈ భవాని, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాది చాంబర్ ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**- హాస్టల్ విద్యార్థులకు పాదరక్షలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

జగ్గంపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 04 : స్థానిక గోకవరం రోడ్ లోని శివ పార్వతి ఫంక్షన్ హాల్ వద్ద న్యాయవాదులు వేగి భద్రం, గవర సుధాకర్, బలబద్దుని కామేష్ ఏర్పాటు చేసిన న్యాయవాది చాంబర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గంపేట శాసనసభ్యుడు, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విశిష్టతిథిగా జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. అనంతరం న్యాయవాదులు ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమం ఎమ్మెల్యే నెహ్రూ పాల్గొని హాస్టల్ విద్యార్థులకు పాదరక్షలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ జగ్గంపేట టౌన్ లో యువ న్యాయవాదులు న్యాయవాది చాంబర్ ఏర్పాటు చేయడం చాలా సంతోషమని, అది నా చేతుల మీదుగా ప్రారంభించడం మరింత ఆనందం ఇచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పాండ్రంకి రాంబాబు, పైడిపాల సూరిబాబు, వేములకొండ జోగారావు, సర్వసిద్ధి లక్ష్మణరావు, కంటే రామారావు, మండపాక అప్పన్న దొర, పీలా మహేష్, అరటా పోలీస్, జనసేన ఎంపీటీసీ దొడ్డ శ్రీను, కడిమిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు ఉచితంగా త్రీవీలర్ మోటారు సైకిళ్లు

**- ఈ నెల 25 వరకు దరఖాస్తుల ఆహ్వానం**

విజయవాడ, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 04 : రాష్ట్రంలోని అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా 1750 రెట్రోఫిట్ త్రీ వీలర్ మోటారు సైకిళ్లను అందజేస్తామని అందజేస్తామని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఈ నెల 25 లోపు www.apdas-cac.ap.gov.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 'డ్రైవింగ్ లైసెన్స్ ఉండి, రెగ్యులర్ డిగ్రీ, ఆపై ఉన్నతవిద్య చదువుతున్న విద్యా ర్థులు, పదో తరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధితో జీవించేవారు, 18 నుంచి 45 ఏళ్ల లోపు ఉండి 70 శాతం అంగవైకల్యం ఉన్న వారు దరఖాస్తు చేసు కొనేందుకు అర్హులు అని మంత్రి స్వామి వెల్లడించారు.



# విభిన్న పాత్రల్లో తన ప్రతిభ ను చూపిన చిరంజీవి "అభి"

రాజమహేంద్రవరం, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 04 : రాజమహేంద్రవరం శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో జరిగిన శ్రీ శివ సాయి కూచిపూడి కళాక్షేత్రం తృతీయ వార్షికోత్సవ విజయోత్సవ కార్యక్రమంలో విభిన్న పాత్రలతో తన ప్రతిభను చాటుకున్న చిరంజీవి సి.హెచ్ "అభి"కి పలువురి ఆశీస్సులు దక్కాయి. వరుసగా మూడు రోజులు పాటు జరిగిన శ్రీ శివ సాయి కూచిపూడి కళాక్షేత్ర తృతీయ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వాహికురాలు కళాతపశ్వి తణుకు సాయి మాధవి సారథ్యంలో గురువుల ప్రోత్సాహంతోను తన విద్యార్థిణిల కళా నైపుణ్యంతోను ఎంతో అంగ రంగ వైభవొత్సవంగా వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. ఒక పరమ శివునిగాను, శ్రీరాముడిగాను, శ్రీ కృష్ణ పరమాత్మునిగాను , అమ్మవారిగాను మరి కొన్ని విలక్షణ పాత్రలతో అబ్బుర పరిచిన చిరంజీవి "అభి" ను పలువురు గురువులు, పెద్దలు, వీక్షకులు ప్రత్యేక అభినందనలతో ముంచెత్తారు. పెద్దల ఆశీస్సులు అందించారు. ప్రతి పాత్రలోను పాత్రకు జీవం పోసిన "అభి" ప్రతిభను ఇంత గొప్పగా తీర్చి దిద్దిన శివ సాయి కూచిపూడి కళాక్షేత్ర నిర్వహికురాలు తణుకు సాయి మాదవికే



అంకితం అని ఈ సందర్భంగా అభి తల్లిదండ్రులు వెంకట్, భవానీలు వారి ఆనందం వ్యక్త పరిచారు. కొన్ని విభిన్న పాత్రల్లో పార్వతి పరమేశ్వరునిగాను, సీతా రాములుగాను అభి - కిరణ్ మయ్ లు ఎంతో నిండు తనంతో వారి కళా ప్రతిభను చాటుకున్నారు. వారి ఇరువురి కాంబినేషన్ అద్భుతం అని వీక్షకులు కితాబులు పలికారు. అభి - కిరణ్ మయ్ లు ఏ పాత్రలో నైనా, నృత్యంలో నైనా లీనమై పోతారని, నటరాజుడు తాండవించే ఒక కళా కండం వారిలో కనపడుతుందని పలువురు చర్చించుకున్నారు. వార్షికోత్సవ సభలో "అభి" తోపాటుగా శ్రీ శివ సాయి కూచిపూడి కళాక్షేత్ర విద్యార్థిణిలు ఎవరికి వారు వారి నైపుణ్యాన్ని వివిధ పాత్రలతో వేదికను కళ కళలాడించారు. ఇంత గొప్పగా కూచిపూడి కళను రాజమహేంద్రవరంలో అభివృద్ధి పరుస్తు జాతీయ స్థాయిలో అనేక విజయాలను సొంతం చేసుకున్న తణుకు సాయి మాదవి సేవలను కూచిపూడి కళా ప్రియులు ఎన్నటికీ మరువలేరని ఆమె సేవలను, ప్రతిభను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు. ముందు ముందు శ్రీ శివ సాయి కూచిపూడి కళాక్షేత్రం నిర్వహికురాలు తణుకు సాయి మాధవి ప్రతిభ మరియు ఆమె తీర్చిదిద్దిన విద్యార్థిణిలకు జాతీయ స్థాయిలో గౌరవ ప్రతిష్టత్మమైన గుర్తింపు దక్కటం ఖాయమని విచ్చేసిన పెద్దలు ఆశాభావం వ్యక్తపరిచారు.

# పారిశ్రామికాభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం

## యువత, మహిళలు పరిశ్రమల స్థాపనపై దృష్టి సారించాలి - డీఆర్డీఏ పీడీ సాయినాథ్ జయచంద్ర

కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 04 : పారిశ్రామికాభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, గ్రామీణ యువత, మహిళలు పరిశ్రమల స్థాపనపై దృష్టి సారించాలని డీఆర్డీఏ పీడీ సాయినాథ్ జయచంద్ర సూచించారు. కొత్తపేట బులిసత్యం కాపు కళ్యాణమండపంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచనల మేరకు ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన ఎంఎస్ఎంఈ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సదస్సులో పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక చైతన్యం పెంపొందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. చిన్న పరిశ్రమలు, స్వయం ఉపాధి పథకాలు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని అన్నారు. స్థానికంగా లభ్యమయ్యే కొబ్బరి, అరటి, చేపల ఉత్పత్తులపై ఆధారపడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఎంఎస్ఎంఈ, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎమ్ఈ వంటి పథకాల ద్వారా రుణ సదుపాయాలు, శిక్షణ, సాంకేతిక సహాయం అందిస్తున్నదని వివరించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచనల మేరకు




రావులపాలెంలో ఐపీఓ ఏర్పాటు చేసి, కేంద్ర%-%రాష్ట్ర ప్రభుత్వాల నుండి లభించే పథకాలపై అవగాహన కల్పించే చర్యలు చేపడతామని తెలిపారు. యువత తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ, ఫిషరీస్ ఏడి వర్ధన్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, పీఎంఈజీపీ%-%పీఎంఎఫ్ఎమ్ఈ జోనల్ మేనేజర్ శ్రీనివాస్, నాబార్డ్ బ్యాంక్ మేనేజర్ స్వామి నాయుడు, ఎంపీడీవో నరేష్, మండల టీడీపీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, కొత్తపేట సర్పంచ్ బూసి జయలక్ష్మి, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, మండల ప్రతి పక్ష నేత రెడ్డి శ్రీనివాస్, సర్పంచ్ లు పల్లి భీమారావు, త్సామా బాబు, సాదే లక్ష్మి శ్రీనివాస్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మిద్దే ఆదినారాయణ, డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్ చవల జగన్నాథం, ధరణాల రామకృష్ణ, రెడ్డి తాతాజీ, కముజు గంగాధరం, పల్లి ఏసు, బూసి భాస్కరరావు, ముత్యాల బాబ్జి, పాలూరి సత్యానందంరావు, కంఠంశెట్టి చంటి, సంపతి కనకేశ్వరరావు, సిద్దంశెట్టి సత్యనారాయణ, విళ్ళ మారుతి, కదలి భీమేశ్వర రావు, యల్లమిల్లి చంద్రకుమారి, యల్లమిల్లి జగన్మోహన్రావు, వాసంశెట్టి సత్యనారాయణ, చోడపనీడి ఉమ, దేవపాటి వెంకటేశ్వరరావు, చిలకమర్తి శ్రీనివాస్, తమ్మన సాయి ప్రసాద్, కొత్తపల్లి వెంకటరమణ, కముజు వెంకటేశ్వరరావు, చోడపనీడి భాస్కరరావు, తులా రాజు, బొక్కా కుమార్, చీకరమిల్లి లోవరాజు, పోలాబత్తుల సుబ్రహ్మణ్యం, బండారు వీరబాబు, దంగేటి చంటి, నల్లా రమణ, బొక్కా ప్రసాద్, చిత్రపు ఆనందబాబు, డీఆర్డీఏ పీడీ జయచంద్ర గాంధీ, ఇండస్ట్రియల్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ, ఎల్ డి ఎం కేశవ వర్మ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'సాస్కి' నిధులను సద్వినియోగం చేసుకోవాలి

**- రహదారుల నాణ్యతలో రాజీపడబోము**

పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. ప్రత్యేక శ్రద్ధతో మన గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అభివృద్ధికి తీసుకువచ్చిన నిధులు ఇవి. వీటి ఫలాలు ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులుపైనా, అధికార యంత్రాంగంపైనా ఉంది. ప్రతి నియోజకవర్గంలో రోడ్లు మెరుగుపడే విధంగా నిధులు సమకూరుస్తున్నాము. ఎక్కడా నాణ్యత విషయంలో రాజీపడవద్దు. రహదారుల నిర్మాణంలో నిబంధనలకు అనుగుణంగా, ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో పరిశీలించాల్సిన బాధ్యత అధికారులదే. నిర్మాణం కాంట్రాక్టు పొందినవారికీ ముందుగానే నాణ్యతా ప్రమాణాల గురించి తెలియచేయండి. ఆ ప్రమాణాలకు తగ్గట్లు నిర్మిస్తున్నదీ లేనిదీ తనిఖీ చేయడం అవసరం. నిర్మాణం మొదలయ్యాక పలు దశల్లో క్వాలిటీ చెక్ చేయాలి. తాను, నిపుణులు క్షేత్ర స్థాయికి వెళ్ళి నాణ్యతా ప్రమాణాలు పాటించారో లేదు తనిఖీ చేస్తాము. ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఏ మాత్రం అవకతవకలు జరిగినా ఉపేక్షించవద్దు.

**- ప్రతి గ్రామానికీ మంచి రహదారులు ఉండాలి**

ప్రజలకు పటిష్టమైన రోడ్లు అందించడం అవసరం. మౌలిక వసతుల కల్పనలో రహదారులు కీలకమైనవి. సాస్కి ద్వారా వస్తున్న రూ.2వేల కోట్లతో ప్రాధాన్యత క్రమంలో రోడ్లు నిర్మించుకొనే అవకాశం వచ్చింది. ప్రత్యేకమైన ప్రాంతాల్లో, సందర్భాల్లో ఈ నిధుల నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయవచ్చు. పుట్టపర్తిలో శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా అక్కడ మౌలిక వసతులు కల్పనలో భాగంగా పంచాయతీ రోడ్లు పటిష్టపరచాలని ప్రజా ప్రతినిధులు, అధికారులు వివరించారు. ఇందుకోసం రూ.35 కోట్లను ఈ నిధుల నుంచి వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇలాంటి కీలకమైన అభివృద్ధి పనులకు సాస్కి నిధులు ఎంతగానో తోడ్పడతాయి. రోడ్ల నిర్మాణం విషయంలో గత ప్రభుత్వం పూర్తి అలక్ష్యంతో వ్యవహరించింది. వివిధ మార్గాల్లో రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు వచ్చే వెసులుబాటు ఉన్నప్పటికీ, దానిని విస్మరించింది. కూటమి ప్రభుత్వం కేంద్ర సహకారంతో ఎప్పటికప్పుడు రాష్ట్రంలోని వివిధ అభివృద్ధి పనులకు నిధులు సాధిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము. నిధులు పొందటంలో, వాటిని వినియోగించే ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు తగిన సూచనలు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించాలని కృత నిశ్చయంతో ఉంది. ఇందులో అధికార యంత్రాంగం కీలక భూమిక పోషించాలన్నారు.

# బస్సు ఆపరేటర్లతో ఆర్టీవో మురళీధర్ సమావేశం





కావలి,
కావలి ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో మంగళవారం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆపరేటర్లతో కావలి రవాణా శాఖ అధికారి (ఆర్టీవో) మురళీధర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బస్సు యజమానులు,నిర్వాహకులు, మేనేజర్లు ప్రయాణికుల సురక్షిత ప్రయాణంపై అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైవర్ల నిర్లక్ష్యంతో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో,డ్రైవర్లకు బస్సు బాడీ భద్రతా ప్రమాణాలు వాహన సురక్షిత నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఇటీవల కర్నూలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 19 మంది మృతి చెందడం బాధాకరమని,ఆ ప్రమాదంలో డ్రైవర్ తప్పిదంతోపాటు బస్సుబాడీ నిర్మాణ లోపాలు కూడా తీవ్రతకు కారణమని వివరించారు.ట్రావెల్స్ బస్సులపై నిఘా పెంచామని తెలిపారు. ఇప్పటివరకు 5 బస్సులను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నామని,5 బస్సుల పై కేసులు నమోదు చేసి చలనా విధించడం జరిగిందని వెల్లడించారు. భద్రతా అంశాలపై చర్చ సందర్భంగా ఎమర్జెన్సీ ఎగ్జిట్లు, ఫైర్ డిటెక్షన్ అలారమ్ సిస్టమ్లు, ఫైర్ ఎక్సింగ్విషర్లు, డైమండ్ హామర్లు, కోచ్ లేఅవుట్ వంటి అంశాలపై చర్చించారు.ఈ సమావేశంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారులు మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ సుందర్ రావు, అసిస్టెంట్ వెహికల్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, అసిస్టెంట్ వెహికల్ ఇన్స్పెక్టర్ లక్ష్మి బాయి,ట్రావెల్స్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.



# విశాఖపట్నంలో తెల్లవారుజామున భూకంపం!

## - భయాందోళనకు గురైన స్థానికులు

విశాఖపట్నం, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 04 : మంగళవారం తెల్లవారుజామున 4.24 నిమిషాలకు విశాఖపట్నం నగరాన్ని స్వల్ప భూకంపం వణికించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కొంతమంది నివాస ప్రాంతాల వారు భూకంపం అనిపించడంతో ఇళ్ల బయటకు పరుగులు తీశారు. ముఖ్యంగా మురళీనగర్, గాజువాక, మాధురవాడ, ఎంవిపి కాలనీ, గోపాలపట్నం ప్రాంతాల్లో తేలికపాటి వణుకులు నమోదయ్యాయని స్థానికులు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్పై 3.0 చుట్టుపక్కలగా నమోదై ఉండవచ్చని భూకంపశాఖ అంచనా వేస్తోంది. అధికారిక ధృవీకరణ కోసం నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ (ఎన్.సి.ఎస్) పరిశీలన ప్రారంభించింది. భూకంపం తక్కువ తీవ్రతతోనే ఉన్నప్పటికీ, ప్రజల్లో ఒకింత ఆందోళన నెలకొంది. కొందరు భయంతో ఇళ్ల బయటే రాత్రి గడిపినట్లు సమాచారం. ప్రస్తుతం ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వివరాలు లేవని అధికారులు తెలిపారు. అయినప్పటికీ, జాగ్రత్త చర్యలుగా ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**- భయపడవలసిన అవసరం లేదు**

ఇది స్వల్ప భూకంపం మాత్రమే. అయితే భద్రత కోసం ఎవరైనా అనుమానాస్పద వణుకులు గమనిస్తే వెంటనే సమాచారమివ్వాలి. విశాఖ ప్రజల మనసుల్లో భయం తళుక్కు, కానీ అప్రమత్తతతో ప్రశాంతతకు మళ్లీ చేరారు.

# స్టూడెంట్స్ తో కాళ్లు నొక్కించుకున్న టీచర్

శ్రీకాకుళం, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 04 : పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయురాలు వారితో కాళ్లు పట్టించుకున్న ఘటన శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం బందపల్లి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో వెలుగు చూసింది. ఇక్కడి ఉపాధ్యాయురాలు సెల్ ఫోన్ లో మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థినులతో కాళ్లు నొక్కించుకుంటున్న వీడియో ఆలస్యంగా బయటకు వచ్చింది. ఈ విషయంపై ఐటీడీఏ సీతంపేట పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మాట్లాడుతూ సంబంధిత ఉపాధ్యాయురాలికి ఇప్పటికే షోకాజ్ నోటీసు జారీ చేశామని, విచారణకు ఆదేశించామని చెప్పారు.



# గుంటూరులో పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశం

## - పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్.



అమరావతి, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 04 : గుంటూరు జిల్లా కలెక్టరేట్లో పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్, సహచర పి.యు.సి సభ్యులతో కలిసి పి.యు.సి సభ్యులు, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశం నిర్వహించి, వార్షిక నివేదికలు, కార్యకలాపాలు మరియు సాధారణ పనితీరును సమీక్షించారు. ఏపీ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్, ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రా డెవలప్మెంట్ కార్పొరేషన్, ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్, ఏపీ ఎయిర్పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థల గురించి చర్చించారు.ం

# ఉత్తమ పియంశ్రీ పాఠశాలగా ముస్లాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఎంపిక




ఉమ్మడి మెదక్ జిల్లా, సింహగర్జన ప్రతినిధి , నవంబర్ 04 : తెలంగాణ రాష్ట్రంలోని పిఎంశ్రీ పాఠశాలల్లో 2024- 2025 విద్యా సంవత్సరంలో వివిధ అంశాలలో నిర్వహించిన కార్యక్రమాలను పరిశీలించి బాగా నిర్వహించిన జడ్పీహెచ్ఎస్ ముస్లాపూర్ పాఠశాలను ఉత్తమ పిఎంశ్రీ పాఠశాలగా రాష్ట్ర విద్యా సంచాలకులు నవీన్ నికోలస్ ప్రకటించారు. రాష్ట్రస్థాయిలో జరిగిన పిఎంశ్రీ ప్రధానోపాధ్యాయుల సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రమేష్ ని ఏఎస్ పిడి రాధా రెడ్డి, జేడీ రాజీవ్, జేడీ వెంకట నర్సమ్మ అభినందించి సన్మానించారు. ఉత్తమ పిఎంశ్రీ పాఠశాలగా ఎంపికైనందుకు జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ రాధా కిషన్, మండల అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి, ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు.

# దామాషా పద్ధతిలో బీసీ కార్పొరేషన్లకు నిధులు

విజయవాడ, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, నవంబర్ 04 : జనాభా దామాషా పద్ధతిలో ఆయా కార్పొరేషన్లకు నిధులు కేటాయించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత సష్టం చేశారు. బీసీ రక్షణ చట్టం రూపకల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ఇదే విషయమై ఇప్పటికే బీసీ మంత్రులతో సమావేశాలు సైతం నిర్వహించామన్నారు. త్వరలోనే కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు అందజేయనున్నామని వెల్లడించారు. విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్ లో 10 వివిధ బీసీ కులాల కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లతో మంత్రి సవిత ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కులాల చేతివృత్తుల అభివృద్ధికి ఏవిధమైన ఆధునిక పరికరాలు అందజేయాలన్న అంశంపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ బీసీలను అన్ని రంగాల్లోనూ ముందంజలో నిలపాలన్న సంకల్పంతో టీడీపీ ఆవిర్భవించిందన్నారు. ఆనాడు ఎన్టీఆర్ బీసీల అభ్యున్నతికి ఎన్నో సంస్కరణలు తీసుకురాగా, ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెనుబడిన తరగతులకు అండగా నిలుస్తున్నారన్నారు. ఆదరణ పథకాన్ని తీసుకొచ్చి కుల, చేతి వృత్తి దారులకు సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారన్నారు. 2014-19 మధ్య కాలంలో బీసీల సర్వతోముఖాభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో పథకాలు అమలుచేశారన్నారు. అనంతరం వచ్చిన జగన్ బీసీల ద్రోహిగా మిగిలారన్నారు. బీసీలను అన్ని విధాలా అణగదొక్కారన్నారు. 2019-24 మధ్య వెనుకబడిన తరగతులు అన్ని విధాలా తీవ్రంగా నష్టపోయావన్నారు.

**- కుల వృత్తులకు ఆధునిక పరికరాలు**

2024 ఎన్నికల్లో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వం విజయం సాధించడంతో బీసీలకు మరోసారి మంచి రోజులు వచ్చాయన్నారు. బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అమలు చేస్తున్నారన్నారు. చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ల కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి అమలు కోసం కేంద్రానికి పంపామన్నారు. బీసీల రక్షణ చట్టం ఏర్పాటుకు ఇప్పటికే చర్యలు ప్రారంభించామన్నారు. బీసీ మంత్రులతో రెండు పర్యాయాలు సమావేశాలు సైతం నిర్వహించామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 పథకానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుత అభిరుచులకు అనుగుణంగా కుల, చేతివృత్తిదారులకు ఆదరణ 3.0 పథకం కింద ఆధునిక పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. కుల, చేతివృత్తిదారులకు శాశ్వత ఉపాధే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు.

**- బీసీ బిడ్డల విద్యకు ప్రాధాన్యం**

అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీ బిడ్డల విద్యకు సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. గత ప్రభుత్వం పెట్టిన డైట్, కాస్మోటిక్ ఛార్జీల బకాయిలను అధికారంలోకి రాగానే చెల్లించామన్నారు. హాస్టళ్ల



మరమ్మతులకు రూ.20 కోట్లు మంజూరు చేశామని, ఇటీవల మరో రూ.60 కోట్లు అందజేశామని తెలిపారు. అన్ని హాస్టళ్లు, గురుకులాల్లో సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా డీఎస్సీ, సివిల్ సర్వీసెస్ కోచింగ్ అందజేశామన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అందజేసిన కోచింగ్ ఎందరో బీసీ అభ్యర్థులు ఉపాధ్యాయులుగా నియమితులయ్యారన్నారు.

**- బీసీ పాలక మండళ్లకు విధులు, నిధులు**

బీసీ పాలక మండళ్లను ఉత్సవ విగ్రహాల మాదిరిగా చూడకుండా వాటికి విధులు, నిధులు ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి సవిత వెల్లడించారు. దామాషా పద్ధతిలో ఆయా కార్పొరేషన్లకు నిధులు కేటాయించినున్నట్లు తెలిపారు. బీసీ కార్పొరేషన్ల చైర్మన్లకు సీఎం చంద్రబాబు త్వరలోనే తీపికబురు అందిస్తారని మంత్రి తెలిపారు.

**- భువనమ్మకు మంత్రి సవిత అభినందనలు**

లండన్ లో ప్రతిష్టాత్మకమైన రెండు అవార్డులను మంగళవారం అందుకోనున్న నారా భువనేశ్వరికి మంత్రి సవిత అభినందనలు తెలియజేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సామాజిక సేవలను గుర్తిస్తూ లండన్ లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్(ఐవోడీ) సంస్థ నారా భువనేశ్వరికి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డు ప్రకటించడం హర్షణీయమన్నారు. అదే వేదికపై ఎక్స్ లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో హెరిటేజ్ ఫుడ్ కు లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డును కూడా ఎండీ హోదాలో భువనేశ్వరి అందుకోనున్నారన్నారు. ప్రపంచ కప్ గెలుచుకున్న మహిళా టీమిండియా జట్టుకు మంత్రి సవిత అభినందనలు తెలియజేశారు. అనంతరం మంత్రి సవితను కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు కుడిపూడి సత్తిబాబు, రోణంకి కృష్ణంనాయుడు, దేవంద్రప్ప, నందం అబద్ధయ్య, మరుపిల్ల తిరుమలేశ్వరరావు, మళ్ల సురేంద్ర, సీఆర్ రాజన్, పేరేపి ఈశ్వర్, వీరంకి వెంకట గురుమూర్తి, సీహెచ్.సావిత్రి, రెడ్డి అనంతకుమారి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, వివిధ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్స్ చప్పిడి వెంకటేశ్వరరావు, పెంకే వెంకటేష్, వమ్మి బాలాజీ, పెంకే జగదీష్ ,జయబాబు గుడాల, కదలి వెంకటేశ్వరరావు, కేతా శ్రీను, లక్ష్మణరావు టేకుముడి, మధుసూదనరావు అనసూరి, చిట్టిబానా రామలిగేశ్వరావు, బీసీ సంక్షేమ శాఖాధికారులు పాల్గొన్నారు.

# జ్ఞాపకాల రూపమే – కవిత్వం

పూల మకరందమే సుమగంధమైతే
సరసన నిలిచిన నీ జత ప్రియ నందనమైతే
వలపులపూతోటలు వికసించి పోవా
విరిసిన నవ కుసుమాలు పరిమళించిపోవా
ఎద మాటున దాగిన మాట వినిపించే క్షణాన
విశ్వమంతటా మన జ్ఞాపకాలే
విస్తుపోక క్షణక్షణం ప్రేమ పోరాటాలే...

కవిత్వం ఒక జ్ఞాపకాల భాండాగారం
కవిత్వం కరగని కన్నీటి కావ్యం కవిత్వం కర్షకుడి అసంపూర్ణ జీవం
కవిత్వం కనురెప్పలా కాచే అమ్మ జీవితం
కవిత్వం భావాలను దాచుంచే ప్రణయ శబ్దం
కవిత్వం వర్ణించలేని, వర్ణనకే అందని ఓ మధుర భావం

అంటూ కవిత్వం గురించి, కవనాన్ని వర్ణించడం గురించి, ఒక కవిత్వం అంటే ఏమిటి అని ఆరాధించే అతని అక్షరాలే అర్థంగా నిలుచున్నాయి, సురేందర్ గారి కవిత్వం ఎంతో సుందరంగా, స్పష్టంగా, అర్థవంతంగా ఉందనడంలో అతిశయోక్తి లేదని చెప్పాలి.

**- ఇక కవిత్వం విషయానికి వస్తే...**

**- శీర్షిక : కవిత్వం తప్ప**

నేనేమీ ఇవ్వగలను
చేతులతో..!
నేనేమీ చెప్పగలను
మాటలతో..!
ఓ ప్రేమ కావ్యాన్ని మీ పచ్చని వాకిట్లో
ముత్యాల ముగ్గులతో నింపడం తప్ప..!!

నేనేమి చూడగలను
కనులతో..!
నేనేమి శ్వాసించగలను
ఊపిరితో..!
ఓ మాధుర్యమైన భావాల్ని కలబోసిన కావ్యాన్ని
నీ హృదయ సంద్రంలో
ప్రేమ కవిత్వమై రాయడం తప్ప..!!

**- రచయిత : డా. పగిడిపల్లి సురేందర్**

– సమీక్ష

నేనేమీ ఇవ్వగలను చేతులతో, నేనేమి చెప్పగలను మాటలతో, ఓ ప్రేమ కావ్యాన్ని మీ పచ్చని వాకిట్లో ముత్యాల ముగ్గులతో నింపడం తప్ప...

అర్థవంతమైన భావాలకు ప్రతీక అని చెప్పాలా
లేక అర్థాన్ని నింపుకున్న అక్షరాల హరివిల్లు అని వర్ణించాలా
చేతులతో ఇవ్వలేనిది, మాటలతో చెప్పలేనిది
ప్రేమ కావ్యం గా మారి ముత్యాలముగ్గులో స్పష్టంగా కనిపిస్తుంది వహ్వా ఏమి వర్ణన
మనసుకి ఉత్తేజాన్ని ఇస్తూ, మనసైన వారి జ్ఞాపకాలకు రూపంగా నిలిచిపోతున్నాయి ఈ భావాలు, మధురమైన అక్షర కావ్యాలు...

నేనేమి చూడగలను కనులతో, నేనేమి శ్వాసించగలను ఊపిరితో, మాధుర్యమైన భావాల్ని కలబోసి కావ్యాన్ని నీ హృదయ సంద్రంలో ప్రేమ కవిత్వమై రాయడం తప్ప అంటూ
భావావేశాన్ని గుండెల్లో దాచుకుని, మధురమైన, మాధుర్యమైన తలపుల వలపులతో హృదిని కోమలంగా తాకుతున్న ప్రేమ కవిత్వాన్ని తప్ప ఇంకేమీ ఇవ్వగలను బహుమతిగా



రచయిత :డా పగిడిపల్లి సురేందర్ పూసల సమీక్ష : పోలగాని భానుతేజశ్రీ

కన్నులతో చూడలేనిది
చేతితో తాకలేనిది అందమైన నీ హృదయమే కదా, నన్ను నీలో నింపుకున్న మృదు మధురమైన ఆ అంతరంగమే కదా....
ఒక్కొక్క అక్షరం అమృతమై కురుస్తుంది
ఒక్కొక్క పదం మనసుని తాకి మైమరపిస్తుంది
ఒక్కొక్క వాక్యం విశిష్టమైన అర్థాన్ని పులుముకుని కనుల ముందు సాక్షాత్కరిస్తుంది.

ఇలాంటి మరెన్నో మనసుకు హత్తుకునే కవనాలు మీరు లిఖించాలని, అనంతమైన ఈ సాహిత్య లోకానికి దిక్సూచిగా మీ అక్షరాలు మారాలని, మరెన్నో రచనలు చేసి పాఠకుల మనసులు గెలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**- సమీక్ష : పోలగాని భాను తేజశ్రీ**

## ఏపీ అభివృద్ధికి కేంద్రంగా
# భోగాపురం

విజయనగరం,నవంబర్ 4 : ఏపీ అభివృద్ధికి కేంద్రంగా భోగాపురం విమానాశ్రయం నిలుస్తోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. దీనిని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. విశాఖ అభివృద్ధిలో భోగాపురం కీలకం కానుందన్నారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణం 91.7 శాతం పూర్తి అయిందని పేర్కొన్నారు. మంగళవారం భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ పనులని రామ్మోహన్ నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నాగమాధవి పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. ఉత్తరాంధ్రా సంస్కృతికి ప్రతిబింభంగా భోగాపురం విమానాశ్రయ నిర్మాణాన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పుకొచ్చారు. వచ్చే నెలలో భోగాపురం విమానాశ్రయం నుంచి ట్రైయల్ రన్ నిర్వహిస్తామని తెలిపారు. భోగాపురంలో ఏవియేషన్ యూనివర్సిటీ నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నామని పేర్కొన్నారు. శ్రీకాకుళం, భోగాపురంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. విశాఖపట్నంలో వచ్చే నెలలో జరుగనున్న అంతర్జాతీయ సమ్మిట్‌లో భోగాపురం విమానాశ్రయ పరిసరాల్లో పలు పరిశ్రమల స్థాపనకు తగిన నివేదిక అందజేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ విమానాశ్రయంతో ఇక్కడ పారిశ్రామికంగా ఎంతగానో పురోగతి సాధిసతుందన్నారు.

## కార్తీక వన సమారాధన కర పత్రాలు ఆవిష్కరించిన మెట్ల



అమలాపురం

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహంలో కాపు నాయకులు,రాష్ట్ర తెలగా అభ్యుదయ సంఘం (రి) అమలాపురం అధ్యక్షులు మెట్ల రమణబాబు కార్తీక వన సమారాధన కర పత్రికలను మంగళవారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు,జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి నల్లా స్వామి,మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్,పట్టణ టీడీపీ అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు,శ్రీ సుబ్బాలమ్మ దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయి పుల్లయ్యనాయుడు,సన్నవిల్లి సర్పంచ్ చిక్కం పెదబాబు,ది.ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బోణం సత్తిబాబు,బులియన్ మార్కెట్ మాజీ అధ్యక్షులు చింతలపూడి సత్తిబాబు,పట్టణ తెలుగు యువత అధ్యక్షులు నల్లా మల్లిబాబు,యాళ్ల భాస్కరరావు,నల్లా చిట్టిబాబు,సాధనాల సురేష్,శ్రీను గంధం తదితరులు పాల్గొన్నారు..






## నేత్రపురి శ్రీరామసేవక్ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు స్టీలు ప్లేట్లు నోటు పుస్తకాలు పంపిణీ

గుడ్లూరు, మండలంలోని తెట్టు గ హైస్కూల్లో విద్యార్థులకు గుడ్లూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమరా మాల్యాద్రి 25 స్టీల్ ప్లేట్లు మరియు రెండు స్టీల్ జగ్గులు అందించారు. అలాగే సనాతన ఫౌండేషన్, విజయవాడ వారి సహకారంతో నేత్రపురి శ్రీరామసేవక్ సభ్యులు ఇన్నమూరి ప్రమీల సుధాకర్ మరియు ఎయిర్టెల్ చిన్న ఆరవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు ఉన్న సుమారుగా 80 విద్యార్థులకు నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణి చేసారు.ఈ కార్యక్రమంలో హైస్కూల్ అధ్యాపకులు చిట్యాల చిన్నయ్య సారు మరియు స్కూల్ అధ్యాపకులు,విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com



# థ్రిల్లర్ మూవీలో మీనాక్షి చౌదరి

ప్రముఖ నటి మీనాక్షి చౌదరి కొత్త పాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదలైంది. నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' దర్శకుడు కార్తీక్ దండు ఓ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్. సోమవారమే ఈ సినిమాలో ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ ను విడుదల చేస్తామని నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెలిపారు. అయితే చేవెళ్ళ బసు దుర్ఘటనతో దానిని ఈ రోజుకు వాయిదా వేశారు. ఆ ప్రకారంగా మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్ పోస్టర్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇంకా పేరు పెట్టని ఈ మిథికల్ థ్రిల్లర్ మూవీలో దక్ష అనే ఆర్కియాలజీ సైంటిస్ట్ పాత్రను మీనాక్షి చౌదరి చేస్తోంది. తాజా విడుదలైన పోస్టర్ చూస్తుంటే... ఈ పాత్ర సినిమాలో చాలా కీలకమైందనేది అర్థమౌతోంది. దర్శకుడు సుకుమార్ సైతం నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాతో 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రముఖ కన్నడ సంగీత దర్శకుడు అజనీశ్ బి. లోకనాథ్ దీనికి సంగీతం అందిస్తున్నాడు.

# దుల్కర్ సల్మాన్.. కాంత మూవీ

మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న సినిమా కాంత పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కు తున్న ఈ చిత్రాన్ని సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ పాన్ ఇండియా సినిమా నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్, టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు. ఇటీవలే రేజ్ ఆఫ్ కాంత ట్రాక్‌ను విడుదల చేయగా సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ సాయంత్రం 4 గంటలకు తొలిమెరుపు ఉండబోతుందని నేడు కొత్త పోస్టర్ లాంచ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని రోల్స్‌తో డిజైన్ చేసిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ ఆ తొలి మెరుపు ఏంటనేది క్లారిటీ రానుంది. ఇప్పటికే కాంత మూవీ నుంచి అమ్మాడివే సాంగ్‌ను విడుదల చేశారని తెలిసిందే. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే కాంబోలో వచ్చే ఈ మెలోడీ ట్రాక్ మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. భారతీయ సినిమాలో 1960ల నాటి గత యుగానికి నివాళిగా తెరకెక్కుతున్న కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.



# మరో ఆసక్తికర పోరుకు భారత జట్టు సిద్ధం!?

## -నాలుగో టీ20లో ఆసీస్‌తో అమీతుమీ..-గోల్డ్ కోస్ట్ వేదికగా నాలుగో టీ20 మ్యాచ్


## -కుల్దీప్, సంజూకు ఉద్వాసన పలికే అవకాశం

ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచిన భారత జట్టు మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. గురువారం గోల్డ్ కోస్ట్ వేదికగా జరిగే నాలుగో టీ20లో ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. మూడో టీ20లో అద్వితీయమైన ప్రదర్శనతో ఐదు వికెట్ల తేడాతో గెలుపొందిందిన భారత్.. అదే జోరును నాలుగో టీ20లోనూ కొనసాగించాలనుకుంటుంది. మరోవైపు ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌పై పట్టు సాధించాలని ఆసీస్ భావిస్తోంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మూడో టీ20లో టీమిండియా మూడు మార్పులు చేయడం జట్టుకు కలిసొచ్చింది. కాంబినేషన్ సెట్ అయ్యిందని మ్యాచ్ అనంతరం సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. దాంతో నాలుగో టీ20లో ఎలాంటి మార్పులు చేయకుండా భారత్ బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. అదే జరిగితే కుల్దీప్ యాదవ్, సంజూ శాంసన్‌కు నిరాశే ఎదురుకానుంది.టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహాల్లో భాగంగా టీమిండియా ప్రయోగాలు చేస్తోంది. హర్షిత్ రాణా, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్‌లను తొలి రెండు టీ20ల్లో ఆడించగా.. జట్టు అంచనాలను అందుకోలేకపోయారు. దాంతో మూడో టీ20లో ఈ ముగ్గురిపై వేటు వేసిన గంభీర్.. జితేశ్ శర్మ, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్‌లకు అవకాశాలు కల్పించింది. ఈ ముగ్గురు అద్భుతమైన ప్రదర్శన కనబర్చారు.గాయంతో తొలి మూడు టీ20లకు దూరంగా ఉన్న నితీష్ కుమార్ రెడ్డి అందుబాటులోకి వస్తే తుది జట్టులో చోటు దక్కనుంది. అతని కోసం శివమ్ దూబేను పక్కన పెట్టవచ్చు. ఈ ఒక్కటి మినహా తుది జట్టులో భారీగా మార్పులు జరిగే అవకాశం లేదు. బ్యాటింగ్‌లో శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ సత్తా చాటాల్సి ఉంది. ముఖ్యంగా గిల్, సూర్య వైఫల్యం విమర్శలకు దారి తీస్తోంది. గిల్ స్థానంలో సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా ఆడించాలనే డిమాండ్ కూడా వ్యక్తమవుతుంది. ఈ క్రమంలోనే అతనికి నాలుగో టీ20 కీలకంగా మారింది.

ఆస్ట్రేలియాతో నాలుగో టీ20 ఆడే భారత తుది జట్టు(అంచనా)

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివమ్ దూబే/నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, జితేష్ శర్మ(కీపర్), అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా




# పెద్దిలో మొహిత్ చౌహాన్ పాట

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషన్స్ షురూ అయ్యాయి. సినిమాకు సంబంధించి ఏదో ఒక అప్‌డేట్ ఇస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. తాజాగా కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ క్యారెక్టర్ రివీల్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. అలాగే ఫస్ట్ సింగిల్ టైటిల్ కూడా తెలిపారు. ఈ పాట 'చికిరి' అనే లైన్‌తో ఉంటుందని తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా ఎ.ఆర్.రెహమాన్ వెల్లడించారు. దర్శకుడు, సింగర్ మోహిత్ చౌహాన్‌తో కలిసి కీ బోర్డ్ ముందుకు కూర్చున్న ఫొటోను రామ్‌చరణ్ షేర్ చేసి ఏం వండుతున్నారు గయ్స్' అని ట్వీట్ చేశారు. దానికి 'చికిరి చికిరి.. చరణ్‌గారు' అంటూ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ రిప్లై ఇచ్చారు. దర్శకుడు కూడా అదే సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఎక్స్‌లో వీరి సంభాషణ నెట్టింట వైరల్ మారింది. పాట కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు అభిమానులు పోస్ట్‌లు పెడుతున్నారు. అయితే ఈ పాట ప్రమోషనల్ వీడియోలో రెహమాన్ కూడా కనిపించబోతున్నారు. చికిరి పాటకి సింగర్ గా మోహిత్ చౌహాన్‌ను ఎంపిక చేశారాయన. హిందీలో ఆయన ఎన్నో హిట్ చిత్రాలకు పాటలు పాడారు. అక్కడ ఆయన ఎంతో పాపులర్. 'రాక్ స్టార్' సినిమాలో మొత్తం 15 పాట ఉంటే అందులో తొమ్మిది పాటలిన మోహిత్ ఛౌహాన్‌తోనే పాడించారు రెహమాన్. దాంతో ఆయన పేరు పాపురల్ అయింది. మోహిత్ తెలుగు సంగీత దర్శకులతో ఎక్కువ పని చేయలేదు కానీ తమిళ సినిమా పాటల్ని తెలుగులో పాడారు. ఆయన వాయిస్ కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. దర్శకుడు నాగ్ అశ్విన్‌కు ఆయనపై ప్రత్యేక అభిమానంతో 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాలో 'ఇదేరా' అంటూ సాగే పాటను పాడించారు. తర్వాత డైరెక్ట్ తెలుగు సినిమా పాడిన సందర్భం లేదు. ఇప్పుడు 'పెద్ది' సినిమాతో తెలుగులో మళ్లీ పాడుతున్నారు. అయితే పెక్యులర్ వాయిస్ చికిరి పాటకు కొత్తదనం తీసుకొస్తుందని టీమ్ బలంగా నమ్ముతోంది.

# రాజాసాబ్ సంక్రాంతికి రావడం పక్కా




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రాల్లో ది రాజాసాబ్ సంక్రాతికి పక్కా అని నిర్మాత తేల్చి చెప్పారు.. మారుతీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవిక మోహన్, నిధి అగర్వాల్, రిద్ధి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఎప్పుడెప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందా అని అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ఇక ప్రభాస్ సినిమా అంటే వాయిదా లేకుండా రిలీజ్ ఉండదు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ది రాజాసాబ్ కూడా అదే తరహాలో వరుస వాయిదాలు పడుతూ వస్తుంది. డిసెంబర్ 5 న అనుకున్న సినిమా మరోసారి వాయిదా పడి సంక్రాంతి బరిలో దిగింది. జనవరి 9 న ది రాజాసాబ్ రిలీజ్ కు సిద్ధమవుతుంది. ఇక గతకొన్నిరోజులుగా సంక్రాంతి నుంచి కూడా రాజాసాబ్ తప్పుకుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా రాజాసాబ్ వాయిదా రూమర్స్ ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఖండించాడు. కచ్చితంగా రాజుగారు సంక్రాంతికి వస్తున్నారని తెలిపారు. ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టనున్నట్లు.. డిసెంబర్ లో అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయనున్నట్లు చెప్పుకొచ్చారు. ఇలాంటి పుకార్లను నమ్మకుండా ఉండాలని అభిమానులను కోరాడు. ప్రసుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. మరి ఈ సినిమాతో ప్రభాస్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.